టీటీడీకి రూ.1.11 కోట్లు విరాళం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: రిలయన్స్ ఇండస్ట్రీస్ సీఈఓ పి.ఎం.ఎస్.ప్రసాద్ బుధవారం టీటీడీ ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు ఒక కోటి పదకొండు లక్షల పదకొండు వేల నూట పదకొండు రూపాయలను విరాళంగా అందించారు. ఈ మేరకు విరాళం డీడీని శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

గురువారం 26 డిసెంబర్ 2024 — 8 పేజీలు



ఉరివేసుకొని....

దంపతులు ఆత్మహత్య

– కూచివారిపల్లిలో విషాద ఘటన

విశాలాంధ్ర-చంద్రగిరి: తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం రామిరెడ్డి పల్లి పంచాయతీ దిగువ కూచివారిపల్లెలో క్రిస్మస్ పండగ రోజున విషాదకర సంఘటన చోటు చేసుకుంది. తమ సొంత పొలంలో ఓ చెట్టుకు ఉరి వేసుకుని దంపతులు ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దిగువ కూచి వారి పల్లికి చెందిన పాడిమాని సురేంద్ర బాబు (55) తిరుపతి వైకుంఠపురంలో విద్యుత్ శాఖలో లైన్ మెన్ గా పనిచేస్తూ వైకుంఠపురంలో కాపురం ఉంటున్నారు. బుధవారం మధ్యాహ్నం ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న కూలీలు లైన్ ఇన్స్పెక్టర్ సురేంద్రబాబు, భార్య పి.లత యిద్దరు తమ పొలంలో ఓ చెట్టుకు ఉరివేసుకొని చనిపోయి ఉండటాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న ఎస్ఐ అనిత తమ సిబ్బందితో సంఘటన స్థలం చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా సురేంద్రబాబు తిరుపతిలో కాపురం ఉంటూ తరచూ తమ సొంతూరు కూచివారిపల్లెకి వచ్చి వెళుతుండేవారు. వారికి ఇద్దరు కుమార్తెలు ఉండగా ఇద్దరికీ వివాహమై పెద్ద కుమార్తె నైనా, అల్లుడు మలేషియాలో ఉండగా చిన్న కుమార్తె లిఖిత,

2

తిరుపతి, తిరుమలలో జనవరి 9న ఉదయం 5 గంటలకు

వైకుంఠ ద్వార దర్శనం ఉచిత టోకెన్ల జారీ

- జనవరి 10, 11, 12 తేదీలకు 1.20 లక్షల సర్వదర్శనం టోకెన్లు
- ఈ-టోకెన్లు జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటలకు జారీ
- మూడు రోజుల తర్వాత ఏరోజుకారోజు ముందు రోజు జారీ
- టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజులలో శ్రీవారి దర్శనం ఉండదు
- తిరుపతిలోని 8 ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న కౌంటర్లను తనిఖీ చేసిన టిటిడి ఈవో, అదనపు ఈవో



విశాలాంధ్ర- తిరుపతి : తిరుమల శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుండి 19వ తేదీ వరకు వైకుంఠ ద్వార దర్శనానికి సంబంధించి తిరుపతి, తిరుమలలో సర్వదర్శనం టైంస్లాట్ టోకెన్లు జారీ

చేయనున్నట్లు టిటిడి ఈవో శ్యామలరావు వెల్లడించారు. జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి మొదటి మూడు రోజులకు జనవరి 9వ తేదీన ఉదయం 5 గం.ల నుండి 1.20 లక్షల టోకెన్లు భక్తులకు జారీ చేస్తామని, తదుపరి రోజులకు ఏరోజుకారోజు ముందు రోజు టోకెన్లు జారీ చేస్తామని ఈవో తెలిపారు. తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి, భూదేవి కాంప్లెక్స్, జీవకోన హైస్కూల్, ఇందిరా మైదానం, శ్రీని వాసం, విష్ణునివాసం, బైరాగిపట్టెడలోని రామానాయుడు స్కూల్, ఎం.ఆర్. పల్లి స్కూల్ లతో పాటు (తిరుమలలో బాలాజీ నగర్ లోని కమ్యూనిటీ హాల్‌లో తిరుమల స్థానికుల కొరకు)కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరుపతి లోని 8 కేంద్రాలలో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని

2

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- వివరాలు లోపలి పేజీల్లో

సమ సమాజ నిర్మాణం కోసం...

అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ సిపిఐ

- దేశ సంపూర్ణ స్వతంత్రం కోసం నినదించిన ఘన చరిత్ర కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ
- సిపిఐ శత వార్షికోత్సవాల సందర్భంగా కేక్ కట్ చేసిన సిపిఐ నాయకులు

విశాలాంధ్ర-తిరుపతి: భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాల సందర్భంగా తిరుపతి లో కార్మిక యూనియన్ ఆధ్వర్యంలో కార్మికుల యూనియన్ నాయకులు వైయస్ మణి, పవన్ ఆధ్వర్యంలో 100 సంవత్సరాల శతజయంతి ఉత్సవాలు లో భాగంగా తీసుకొచ్చిన కేక్ ను పద్మావతి పురం గంగమ్మ గుడి ఎదుట సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కే.రాధాకృష్ణ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, జె.విశ్వనాథ్‌లు కేక్ కట్ చేసి ఘనంగా ఉత్సవాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వం పుట్టి ఈ దేశ సంపూర్ణ స్వతంత్రం కోసం నినదించిన ఘన చరిత్ర గలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అనేక ప్రభుత్వాల కుట్ర కేసులను ఎదుర్కొని సమ సమాజ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పక్షాన నిలిచి నిస్వార్థ సేవలు అందిస్తూ

2

నారాయణవనం వ్యక్తి పుత్తూరులో మృతి

విశాలాంధ్ర-పుత్తూరు: పుత్తూరు పట్టణంలోని ధర్మరాజుల స్వామి ఆలయ సమీపంలో బుధవారం ఉదయం ఓ వ్యక్తి మృతి దేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు పోలీసుల కథనం మేరకు నారాయణవనం మండలం అరణ్య కండ్రిగ గ్రామ పంచాయతీకి చెందిన బొమ్మనేటి ఇల్లు కాపురం ఉంటున్న గోపి (50) గా గుర్తించారు మృతుడు పుత్తూరు ప్రభుత్వ పరిసరాల ప్రాంతాల్లో తాపీ మేస్త్రిగా పనిచేస్తూ ఆయన బస్టాండ్ వద్ద ఆలయాల వద్ద రైల్వే స్టేషన్ వద్ద అలా రాత్రి పూట నిద్రిస్తుంటాడు అవివాహితుడు అయిన ఇతడికి సోదరి తిరుపతిలో నివసిస్తోంది సమాచారం అందించి దేహాన్ని పోలీసులు ఆమెకి అప్పగించారు.

ఉచిత టోకెన్ల జారీ

(మొదటి పేజీ తరువాయి) మొత్తం 91 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నా మన్నారు. భక్తులు తమ ఆధార్ కార్డు చూపించి టోకెన్లు పొందాలని, టోకెన్లు పొందిన భక్తులకు ఈసారి వారి ఫోటో గుర్తింపుతో కూడిన స్లిప్ లను జారీ చేస్తామని తెలిపారు. టోకెన్లు లేని భక్తులకు ఈ 10 రోజులలో శ్రీవారి దర్శనం ఉండదని తెలిపారు. కౌంటర్లు ఏర్పాటు చేస్తున్న ప్రాంతాల్లో ప్రత్యేకంగా క్యూలైన్లు, బారీకేడ్లు ఏర్పాటు చేస్తున్నామని, వేచి ఉండే భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పిస్తున్నా మని వివరించారు. సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికి తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలని విజ్ఞప్తి. తిరుపతిలో ఏర్పాటు చేస్తున్న కౌంటర్ల కేంద్రాలను టిటిడి అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టిటిడి జేఈవో గౌతమి, జిల్లా కలెక్టర్ ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, సివిఎస్వో శ్రీధర్ లతో కలిసి ఈవో తనిఖీ చేశారు. ఈవో వెంట సీఈ సత్యనారాయణ, ఎస్.ఈ వెంకటేశ్వర్లు, మనోహర్, ట్రాన్స్ పోర్ట్ జీఎం శేషారెడ్డి, టిటిడి అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

ఆత్మహత్య

(మొదటి పేజీ తరువాయి) అల్లుడు అమెరికాలో స్థిరపడ్డారు. పెద్ద కుమార్తె నైనా, అల్లుడు ఈనెల 22వ తేదీన మలేషియా నుండి వచ్చి తిరుపతిలోని సురేంద్రబాబు ఇంటిలో ఉంటున్నారు. చిన్న కుమార్తె లిఖిత అల్లుడు అమెరికాలోనే ఉన్నారు. ఏమైందో ఏమో కానీ సురేంద్రబాబు కారుని ఇంటి వద్ద ఉంచి ద్విచక్ర వాహనంపై భార్యాభర్తలు ఇద్దరూ సుమారు 11.00 గంటల సమయంలో కూచివారిపల్లెలోని తమ పొలం వద్దకు చేరుకుని యిద్దరు ఓ చెట్టుకు ఉరివేసుకుని మరణించినట్లు సమాచారం. తమ పొలానికి సమీపంలోనే ఇటుక బట్టీలో పనిచేస్తున్న కూలీలు గుర్తించి స్థానికులకు సమాచారం ఇవ్వటంతో స్థానికుల సమాచారం మేరకు ఎస్ఐ అనిత సంఘటన స్థలం చేరుకొని దంపతులు మరణానికి గల కారణాలను విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో దంపతుల ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

అహర్నిశలు కృషి చేస్తున్న పార్టీ సిపిఐ

(మొదటి పేజీ తరువాయి) పనిచేస్తున్న ఏకైక జెండా ఎర్రజెండే నని కొనియాడారు. ఈ దేశంలో భూసంస్కరణలు తీసుకురావడంలో కార్మిక హక్కుల చట్టాలు చేయడంలో ప్రధాన భూమిక పోషించిన ఏదైనా పార్టీ ఉందంటే అది ఒక కమ్యూనిస్టు పార్టీయేనని అన్నారు. భూమిలేని రైతులకు వ్యవసాయ భూములు పంచిన చరిత్ర ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు పంచి నీడ నిచ్చిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా అన్ని వాడ వాడల ఘనంగా ఎర్రజెండా రెపరెపలతో శత జయంతి ఉత్సవాలు జరుపుకోవడం ఆ శతజయంతి ఉత్సవాల్లో మేము సైతం పాల్గొనడం మహదానందంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వైయస్ మణి, కె రామకృష్ణ, అల్లబక్షు, మునీశ్వర్, శ్రీకాంత్ పవన్, రాము, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భాజపా మండల నూతన కార్యవర్గం ఎంపిక...

విశాలాంధ్ర-వి.కోట: భారతీయ జనతా పార్టీ మండల నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక తేజా కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన బూత్ అధ్యక్షుల సమావేశంలో నూతన మండల కార్యవర్గాన్ని ముఖ్య అతిథులుగా జిల్లా పార్లమెంటు సంయోజక్ రెడ్డి ప్రసాద్, అసెంబ్లీ కన్వీనర్ జి.విజయ్ కుమార్‌లు పాల్గొనగా పార్టీ ఎన్నికల అధికారి ఉమామహేష్ సమక్షంలో కమిటీ ని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గంలో మండలం బీజేపీ అధ్యక్షులుగా జి.సోమశేఖర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అలాగే ప్రధాన కార్యదర్శులుగా ఏ.పి.బంగారు రెడ్డి, జయశంకర్, ఉపాధ్యక్షులుగా మాధవ్, హేమంత్ కుమార్, మంజునాథ్, యతేంద్ర రెడ్డి, భాస్కర్ రెడ్డి, నావికా కార్యదర్శులుగా మంజునాథ్ రెడ్డి, రాజప్ప, వెంకటేష్, విజయ్ కుమార్, మంజునాథ్, కోదండ కోశాధికారిగా ప్రభాకర్ లను ఎన్నుకున్నారు.

సీఎం సహాయనిధి రూ. 22 లక్షల చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఐదు మంది లబ్ధిదారులకు చంద్రగిరి శాసనసభ్యులు పులివర్తి వెంకటమణి ప్రసాద్ (నాని) పంపిణీ చేశారు. బుధవారం తిరుపతి రూరల్ మండలం రఘునాథ రిసార్ట్స్ లోని నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. చంద్రగిరి నియోజకవర్గంలోని తిరుపతి రూరల్, రామచంద్రాపురం మండలాలకు చెందిన 5 మంది బాధితులు ముఖ్యమంత్రి సహాయనిధి కోసం దరఖాస్తులు చేసుకున్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని సీఎం సహాయనిధికి దరఖాస్తులు చేసుకున్న బాధితుల వివరాలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధిని నిధులు మంజూరు చేయించారు. రామచంద్రాపురం మండలం మిట్ట కండ్రిగ గ్రామానికి చెందిన కారేటి రామకృష్ణారెడ్డికి రూ.89,424, జి.రమాదేవికి రూ.51,300, పి.రవికి రూ.43,800 రూపాయలు, తిరుపతి రూరల్ మండలం సాయి నగర్‌కు చెందిన పసుపులేటి వెంకటకృష్ణ వంశీకి రూ.15 లక్షలు, తుడా క్వార్టర్స్ కు చెందిన మదన శేఖర్‌కు రూ.4,16954 రూపాయల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే పులివర్తి నాని అందజేశారు. ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామాలలో బాధితుల సమస్యలను తెలుసుకుని సీఎం

సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందజేసినందుకు ఎమ్మెల్యే పులివర్తి నానికి లబ్ధిదారులు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లెక్కల మహేష్ నాయుడు, తులసి నాయుడు, సురేంద్ర నాయుడు, మునిరత్నం నాయుడు, గంగాధర్ నాయుడు, మండల టిడిపి ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిరంజీవి,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ ఇచ్చింది.. అన్నలు లాక్కున్నారు..

గంగవరం మండలంలో ఒక అభాగ్యుడి కన్నీటి గాథ

విశాలాంధ్ర-గంగవరం: భారతదేశంలో ఇన్ని చట్టాలు మారిన మానవత్వానికి దూరంగా మనుషులు జీవిస్తున్నారు అనడానికి గంగవరం మండలం గంగవరం పంచాయతీ చిన్నూరు గ్రామంలో ఒక విషాద గాథ ఉదాహరణగా తీసుకోవచ్చు. వివరాలు ఇలా ఉన్నాయి. చిన్నూరు గ్రామంలో ఉన్న తిమ్మయ్యకు ఏడుగురు సంతానం. ఇందులో పురుషులు ముగ్గురు, మహిళలు నలుగురు మొత్తం ఏడు మంది కలరు. తిమ్మయ్య మరణానంతరం ఆయన భార్య మునెమ్మ అనారోగ్యంలో ఉన్నప్పుడు కనీసం ఎవరు పట్టించక పోగా అన్ని విధాల ఆదుకున్న చిన్న కుమారుడు లక్ష్మయ్యకు మునెమ్మ తనపై ఉన్న ఆస్తి సర్వే నెంబర్ 631/2/సి ఉన్న 0.75 సెంట్లు భూమిని లిఖితపూర్వకంగా రాసి ఇవ్వడం జరిగిందని అట్టి ఆస్తిలో తాను జీవనం కొనసాగిస్తున్నానని ఆయన తెలుపుతూ ఆమె మరణం అనంతరం వీరి అన్నదమ్ములు ఆ భూమిపై స్వార్థ పూర్వకంగా అధికారులతో కుమ్మక్కై లాక్కున్నారని మీడియా పూర్వకంగా ఆయన ఆవేదనా వ్యక్తం చేశారు వీరి తల్లి లిఖితపూర్వకంగా లక్ష్మయ్యకు ఆస్తిని పట్టా పాస్ బుక్కు రూపంలో రాసిచ్చినా కూడా అట్టి ఆస్తిని అన్నదమ్ములు ఇద్దరు ఆక్రమించుకొని లక్ష్మయ్య ను అన్ని విధాలా గాయపరిచి ఇబ్బందులు పెడుతున్నారని ఆయన తెలిపారు. ఎన్ని మార్లు ఈ విషయంపై కోర్టును సంప్రదించగా కోర్టు లక్ష్మయ్యకు అనుగుణంగా వ్యవహరించిన కూడా స్థానిక మండల తాసిల్దార్ కార్యాలయం నుంచి, సహకారం అందరం లేదని తెలిపారు ఇదే విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా వారు సానుకూలంగా స్పందించి అన్నదమ్ములపై కేసులు కట్టినా కూడా వారు అధికారులతో కొమ్మక్కై రికార్డు పూర్వకంగా మార్చి వేరే ఇరువురికి అమ్మకాలు చేసి శారీరకంగా లక్ష్మయ్య కుటుంబాన్ని గాయపరిచి ఇబ్బందులకు గురి చేస్తున్నారని తనకు మీడియానే ఇక రక్ష అని మీడియాను సంప్రదించినట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు తనకు తన తల్లి నుంచి సంక్రమించిన ఆస్తిని అందించకుంటే తన కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుని మరణిస్తామని వారి అన్నదమ్ములకు హెచ్చరించారు. ఈ విషయంపై ఇప్పటికే ఎన్నోసార్లు చిత్తూరు జిల్లా కలెక్టర్ వారిని, సబ్ కలెక్టర్ వారిని సంప్రదించడం జరిగింది అని అయినా కూడా తనకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆయన వ్యక్తం చేశారు. తన తల్లి అనారోగ్యంగా ఉన్నప్పుడు పట్టించుకున్న పాపాన పోనీ తన సహోదరులు ఇప్పుడు ఆస్తి కోసం ఇలా రావడం ఎంతవరకు న్యాయమని ఆయన తెలిపారు. ఇదే విషయంపై పలమనేర్ పట్టణంలో ఉన్న లాయర్ ఒకరు తనకోసం మాట్లాడుతున్నట్లు నటించి వారికి అమ్ముడుపోయారని కూడా ఆయన తెలిపారు. కావున తన వద్దనున్న వారి తల్లి రచించిన డాక్యుమెంట్ పరిశీలించి తనపై ప్రభుత్వ అధికారులు తాసిల్దార్ మంజూరు చేసిన పట్టా పాస్ బుక్కు పరిశీలించి తనకు న్యాయం చేయాలని ఆయన ఆవేదన పూర్వకంగా మీడియాకు విలపించారు.

మండల బీజేపీ అధ్యక్షుడుగా ఆనంద్ బాబు

విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు: మండల బీజేపీ అధ్యక్షుడుగా ఆగరమంగళం గ్రామానికి చెందిన ఆనంద్ బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు బీజేపీ ఎన్నికల పరిశీలకులు యువరాజు తెలిపారు. మండల బీజేపీ కార్యాలయంలో బుధవారం క్రియాశీలక సభ్యులు, బూత్ కమిటీ అధ్యక్షులు ద్వారా పార్టీ కొత్త అధ్యక్షుడు ఎంపికపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆనంద్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు మణివర్మ, రాష్ట్ర ఓబిసి కార్యవర్గ సభ్యులు సుధాకర్, జిల్లా ప్రధానకార్యదర్శి జి.కె.నాయుడు, మాజీ మండల బీజేపీ అధ్యక్షులు మురళి, మండల ప్రధాన కార్యదర్శి

నారాయణమూర్తి ఆచ్చారి, ఎస్సీ మోర్చా మాజీ ప్రధాన కార్యదర్శి సుందరాజు, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు అంజలి, మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు రంజిత్ కుమార్ పాల్గొన్నారు.

చిత్తూరులో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-చిత్తూరు: జిల్లా కేంద్రమైన చిత్తూరు నగరంలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని నగరంలోని అన్ని చర్చిలను సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. బుధవారం ఉదయం నుంచి నగరంలోని అన్ని చర్చుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా పలుచోట్ల క్రిస్టియన్ సోదరులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్రిస్టియన్ సోదరులు చర్చుల్లో భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేపట్టారు. ఈ సందర్భంగా నగరంలోని అన్ని చర్చిల వద్ద సందడి వాతావరణం నెలకొంది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

విశాలాంధ్ర-పాకాల: స్థానిక పట్టణంలోని బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం పాకాల ప్లాటినం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిత్తూరుకు చెందిన శ్రీ వెంకటేశ్వర ఆయుర్వేదిక్ వైద్య హాస్పిటల్ వారి సహకారంతో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరం ద్వారా సుమారు 125 మందికి డయాబెటిక్, బిపి, కీళ్ల నొప్పులు, మలబద్ధకం, పక్షవాతం, నరాల సంబంధిత వ్యాధులకు పరీక్ష లు నిర్వహించి అవసరమైన వారికి ఆయుర్వేదిక్ మందులను ఉచితముగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ రమేష్, డాక్టర్ తులసి లయన్స్ క్లబ్ పాకాల ప్లాటినం అధ్యక్షులు తులసీరామన్, కార్యదర్శి ఆర్వి ప్రసాద్, గురుస్వామి నాయుడు, కుప్ప స్వామినాయుడు, జయరాం నాయుడు, దొరస్వామి నాయుడు, డిసీ రామయ్య, డిసి కేస్ మస్తాన్, జైయన్ బాలాజీ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

విశాలాంధ్ర-గూడూరు: గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి నందు లయన్స్ క్లబ్ ఆఫ్ గూడూరు వై.జె.పి క్లబ్ ఆధ్వర్యంలో బాలింతలకు పౌష్టికాహారం, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి దాతగా పాస్ట్ రీజియన్ ఛైర్మన్ ఆర్.వి.రావు వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల క్రమం తప్పకుండా తమ క్లబ్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న మన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు గోపీనాథ్ రెడ్డి, సుబ్రమణ్యం యాదవ్, శ్రీనివాస్ యాదవ్, పసుపులేటి ప్రసాద్, స్వామి, శివరాం, సుధాకర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-రామకుప్పం: మండల పరిధిలోని క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను పురస్కరించుకుని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రమ్కైన మేజర్ గ్రామ పంచాయతీ లోని ఆర్‌సీఎం చర్చ్‌ను సుందరంగా అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా పెనువేలు సింహా మాట్లాడుతూ మండల పరిధిలోని బల్ల, గెరిగపల్లి, వీర్నమల, తదితర గ్రామాల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగిందని తెలిపారు అనంతరం పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రధానం చేయడం జరిగిందని తెలిపారు కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు తదితరులు పాల్గొన్నారు.

ఇదేమి సం'క్షేమం'..?

దుస్థితిలో ప్రభుత్వ వసతి గృహాలు

తాగునీటికీ తప్పని కష్టాలు

విశాలాంధ్ర-తొట్టంబేడు: ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎపుడు ఏం జరుగుతుందో తెలియదు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విద్యార్థులు చదువులు కొనసాగించాల్సి వస్తోంది. కనీస మౌలిక వసతులు కల్పించడంలో కూడా ప్రభుత్వం విఫలమవుతోంది. సాంఘిక సంక్షేమ వసతి గృహాల అభివృద్ధికి ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తున్నా... వాటిని ఎక్కడా ఖర్చు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. వసతి గృహాల్లో ప్రహరీ, తలుపులు, కిటికీలు, ఫ్యాన్లు, కొళాయిలు, మరుగుదొడ్లు లేక విద్యార్థులు పడుతున్న కష్టాలు అన్నీ ఇన్నీ కావు. కనీసం స్వచ్ఛమైన తాగునీరు కూడా దొరక్క విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. వసతి గృహాల వద్ద ముళ్ల పొదలను కూడా తొలగించే పనులు చేపట్టకపోతుండటంతో విద్యార్థులు పాములు, విష కీటకాలతో సహవాసం చేస్తుండటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ వసతి గృహాల దుస్థితి గురించి స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి శాసనసభలో తన ఆవేదన వెలిబుచ్చారంటే... వాటి దుస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఒక ఎస్సీ బాలుర, మూడు బాలికల వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో కొన్నింటికి మాత్రమే అరకొరగా ప్రహరీ గోడలు నిర్మించారు. పలు వసతి గృహాల్లో గదులకు కిటికీలు, తలుపులు లేవు. ఫ్యాన్లు ఉన్నా పనిచేయవు. కొళాయిలు విరిగి పోయి ఏళ్లు గడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేడు. వసతి గృహాల నుంచి మురుగునీరు బయటకు వెళ్లే వీలు లేక ఆవరణలోనే నిల్వ ఉంటోంది. విద్యార్థులు ఈ దుర్వాసన భరిస్తూ చదువుకోవాల్సి వస్తోంది. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల పక్కన తెలుగుగంగ కాలనీలో ఉన్న మహిళల వసతి గృహం, ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఉన్న సమీకృత బాలుర హాస్టళ్లకు ప్రహరీ గోడ నిర్మాణం పూర్తి చేయలేదు. దీంతో పందులు నేరుగా వసతి గృహ ఆవరణలోకి వస్తున్నాయి. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పక్కన ఉన్న ఎస్సీ మహిళా వసతి గృహానికి ప్రహరీ గోడ లేకపోవడంతో సాయంత్రం వేళల్లో ఆకతాయిలు విద్యార్థినులను ఈవ్ టీజింగ్ చేస్తున్నారు. కొందరు యువకులు హాస్టల్ ఆవరణలోకి వచ్చి అమ్మాయిలను వేధిస్తున్నా అడిగే వారు కరువయ్యారు. హాస్టళ్ల ఆవరణలో ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో నిత్యం పాములు, విష పురుగులు గదుల్లోకి చొరబడుతుండటంతో విద్యార్థులు నిద్రలేని రాత్రులు గడపాల్సి వస్తోంది. ఈ వసతి గృహాన్ని శనివారం శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ఆయనకు తమ బాధలు ఏకరువు పెట్టారు. వంద మందికి పైగా విద్యార్థులు ఉంటే... కేవలం 10 గదులు మాత్రమే ఉన్నాయని... అందులో రెండు గదులు శిథిలావస్థకు చేరుకోవడంతో ఎనిమిది గదుల్లోనే సర్దుకోవాల్సి వస్తోందంటూ వారు తమ ఆవేదన వెలిబుచ్చారు. స్నానపు గదులు, మరుగుదొడ్ల కొరతతో విద్యార్థినులు పడుతున్న బాధలు అక్షరాల్లో వర్ణించలేం. వసతి గృహాల్లో అపరిశుభ్రత కారణంగా విద్యార్థులు అనారోగ్యం బారిన పడుతున్నారు. రాజకీయ నేతలు వసతి గృహాలు పరిశీలించి సానుభూతి వ్యక్తం చేస్తారు తప్ప... ఆ సమస్యల పరిష్కారానికి వారు కృషి చేయడం లేదనే విమర్శ బలంగా ఉంది. తాగునీటికీ తప్పని తిప్పలు.. ప్రతి ప్రభుత్వ వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేసి విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేయాలనే నిబంధన ఉంది. అయితే ఏ వసతి గృహంలో కూడా ఆర్వో ప్లాంటు కనిపించదు. ఫలితంగా మున్సిపల్, బోరు నీటినే విద్యార్థులు తాగాల్సి వస్తోంది. కొన్ని వసతి గృహాలకు మున్సిపల్ నీరు కూడా సరఫరా కాకపోవడంతో బోరు నీరు తాగి రోగాల బారిన పడుతున్నారు. కొన్ని చోట్ల నీటిలో ఫ్లోరైడ్ కూడా ఉండటంతో విద్యార్థులు ఒంటి నొప్పులు, మోకాళ్ల నొప్పులతో బాధపడాల్సి వస్తోంది. పలు వసతి గృహాలకు ఆర్వో ప్లాంటు ఇస్తామంటూ ప్రజాప్రతినిధులు హామీ ఇచ్చినా ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదు. పేరుకు సంక్షేమ వసతి గృహాలు. అయితే వాటి సంక్షేమం కోసం ప్రభుత్వం నయా పైసా కూడా ఖర్చు చేస్తున్న పాపాన పోలేదు.

పాకాలలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్ట్

117 గ్రాముల బంగారు ఆభరణాలు, నలభై వేల రూపాయలు నగదు స్వాధీనం

విశాలాంధ్ర-పాకాల: పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను పట్టుకుని అతని వద్ద నుండి 117 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 40 వేల రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు పాకాల సీఐ మద్దయ్య ఆచారి తెలిపారు. బుధవారం పాకాల పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో చోరీలకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. ఇటీవల పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలో వరుస దొంగతనాలు జరుగుతుండడంతో జిల్లా ఎస్పీ సుబ్బారాయుడు ఆదేశాల మేరకు డిఎస్పి ప్రసాద్ సూచనలతో నిఘా పెంచడంతోపాటు, ముమ్మరంగా సాగించిన దర్యాప్తులో ఈ ఘటనలకు పాల్పడుతున్నది అన్నమయ్య జిల్లా మదనపల్లి పట్టణం రామారావు కాలనీకి చెందిన రాఘవయ్య కుమారుడు శ్రీనివాసులుగా గుర్తించామన్నారు. ఇతడు పాత నేరస్తుడని చిత్తూరు, కదిరి, మదనపల్లి లలో గత పది సంవత్సరాల నుండి చోరీలకు పాల్పడుతూ పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతున్నాడన్నారు. ఇతనిపై కడప, చిత్తూరు, తిరుపతి, అనంతపురం జిల్లాల పరిధిలోని పోలీస్ స్టేషన్‌ల పరిధిలో సుమారు 20 కేసుల వరకు ఉన్నాయన్నారు. మంగళవారం సాయంత్రం 4:30 గంటల పాకాల రైల్వే స్టేషన్ వద్ద సంచరిస్తుండగా అతనిని అరెస్టు చేసి అతని వద్ద నుండి పాకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని చోరీలకు సంబంధించిన 117 గ్రాముల బంగారు ఆభరణాలతో పాటు 40,000 నగదు స్వాధీనం చేసుకొన్నామన్నారు. వరుస చోరీలకు పాల్పడుతున్న దొంగను చాకచక్యంగా పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవి, కులశేఖర్, సరస్వతి, గౌరీ శంకర్, తులసి, మహేష్, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు యేసు..

గూడూరులో క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-గూడూరు: క్రిస్మస్ పండుగ సందర్భంగా గూడూరు పట్టణంలోని పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పెద్ద చర్చ్ ఎస్.పి.ఎల్.సి. చర్చిని అందంగా అలంకరించారు క్రిస్మస్ ట్రీ ని ఏర్పాటు చేశారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యేసు గీతాలను ఆలపించారు పాస్టర్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ లోక రక్షణ కొరకు ప్రభు జన్మించారని మన కొరకు ఎన్నో కష్టాలు అవమానాలు భరించాడని తెలుపుతూ దైవ సందేశాన్ని అందించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకుని పండుగను ఆనందంగా జరుపుకున్నారు. అనంతరం శాంతినగర్‌లో ఉన్న హోసన్నా మందిర్ లో క్రిస్మస్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పండుగ విశిష్టతను తెలియజేస్తూ చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా పాస్టర్ కాంతారావు పండుగ విశిష్టతను తెలియజేస్తూ దైవ సందేశాన్ని అందించారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు

విశాలాంధ్ర-పుత్తూరు: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్ బాబు నేతృత్వంలో బుధవారం పట్టణంలోని ఎంబి రోడ్డులో వున్న ఆయన కార్యాలయంలో టిడిపి నాయకులంతా క్రిస్మస్ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విజయ్ బాబు మాట్లాడుతూ ఏసు ప్రభువు చూపించిన మార్గంలో ప్రజలంతా ప్రేమ, శాంతి, సామరస్యంతో కలిసి మెలిసి జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపిటిసి శ్రీజ బాలాజీ నాయుడు, టిడిపి వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి రవినాయుడు, ఎస్సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జి.ధనపాల్, సూపర్ బజార్ చైర్మన్ చంద్ర యాదవ్, మాజీ ఎంపీటీసీ పాండురంగయ్య, టిడిపి మహిళా విభాగం నగరి నియోజకవర్గ కార్యదర్శి నాగరత్నం, మాజీ పాండురంగయ్య, ఇంకా నాయకులు దాసరి విజయ్ చౌదరి, మణికంఠ, కృష్ణమనాయుడు, శంకర్ నాయుడు, పోతుగుంట రమేష్, తాతినేని రాజ తదితరులు పాల్గొన్నారు.

బిజెపి మండల అధ్యక్షులుగా కుమార్ రాజు

విశాలాంధ్ర-కార్వేటినగరం: కార్వేటినగరం మండల నూతన బిజెపి అధ్యక్షునిగా దేవలరాజు కుమార్ రాజును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సీనియర్ బిజెపి నాయకులు యువరాజు ఆధ్వర్యంలో ఎన్నుకోవడం జరిగింది. పార్టీ ఆదేశాలను అనుసరించి బుధవారం కార్వేటినగరంలో ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ నుండి ఎన్నికల అధికారిగా మణివర్మ హాజరైనారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు నడింపల్లి యువరాజు, రామిశెట్టి రాజశేఖర్, పాపయ్య గౌతమి పాని మొదలి శివలింగం మునిరత్నం రెడ్డి చంద్రశేఖర్ రాజు పోలింగ్ బూత్ అధ్యక్షులు కేసీలిక సభ్యులు కార్యకర్తలు కుమార్ రాజుని ఏకగ్రీవ ఎన్నుకోవడం జరిగింది. బిజెపి పార్టీని క్షేత్రస్థాయిలో వాటిని పోలోపేతం చేస్తానని నూతన అధ్యక్షులు కుమార్ రాజు తెలిపారు.

పోరాటయోధునికి సన్మానం

విశాలాంధ్ర-పలమనేరు: నిత్యం ప్రజాసేవలో ఉంటూ ప్రజల సమస్యల కోసం పోరాడుతున్న పోరాటయోధునికి బైరెడ్డిపల్లి మండలం మురారి పల్లి గ్రామానికి చెందిన విశ్వనాథ్ అనే రైతు బుధవారం పలమనేర్ పట్టణంలో జాతీయ మానవ హక్కుల కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు డి.వి. మునిరత్నంను శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విశ్వనాథ్, గోపాల్ గౌడ్ మాట్లాడుతూ సమాజంలో ప్రజా సమస్యలపై నిస్వార్థముతో పోరాడుతున్న వ్యక్తి డివి మునిరత్నం అని కొనియాడారు. ఎక్కడ సమస్య ఉందని తెలిసిన వెంటనే ఆపద్భాంధవుడుగా తన బృందముతో హాజరై అన్ని విధాల అధ్యాయనం చేసిన తర్వాత పరిష్కారానికి కృషి చేస్తాడని కొనియాడారు. కొన్ని సందర్భాల్లో అనేక సమస్యలపై తాను నేర్చుకున్న లౌకికవాదం, సోషలిజం భావాలతో ఇరువురులకు ఎలాంటి తగాదాలు లేకుండా ఒప్పించి అనర్గలంగా పరిష్కరించిన ధైర్యశాలి అన్నారు. బైరెడ్డిపల్లి మండలం మురారి పల్లి గ్రామం, కుమ్మరి గుంట దాసర్లపల్లి తదితర గ్రామాల్లో తీవ్రమైన సమస్యలు వచ్చినప్పుడు తన చరవాణి ద్వారానే పరిష్కరించిన బుద్ధిశాలి అని పేర్కొన్నారు. ఆయన ప్రజల పట్ల, సమాజము పట్ల వ్యవహరిస్తున్న మంచి విధానాలకు ఆకర్షితులై ఆయన అడుగుజాడల్లో నడిచి నిస్వార్ధముతో ప్రజలకు సేవ చేయాలనే సంకల్పముతో జాతీయ మానవ హక్కుల సంస్థలోకి సభ్యులుగా చేరి సంస్థ అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేకి క్రిస్మస్ శుభాకాంక్షలు వెల్లువ

విశాలాంధ్ర-గూడూరు: క్రిస్మస్ పండుగ సందర్భంగా నెల్లూరులో ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ నివాసంలో బుధవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండా లక్ష్మి నారాయణ ఎమ్మెల్యే సునీల్ కుమార్‌ని కలిసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మి నారాయణ మాట్లాడుతూ క్రీస్తు ఆశీస్సులతో ఎమ్మెల్యే సునీల్ కుమార్ భవిష్యత్‌లో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని కోరుకుంటున్నమన్నారు. ఈ కార్యక్రమంలో కొండా భాస్కర్, రాజేంద్ర ప్రసాద్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అధ్యక్షులుగా కాదండపాణి మొదలియర్

విశాలాంధ్ర-కార్వేటినగరం: గ్రామ చెరువు కట్ట కింద వెలసిన శిష్ట సౌందర్యవల్లి సదాశివ ఆలయం బుధవారం నూతనంగా కార్యవర్గంలో ఎన్నుకోబడినది. ఆలయ అధ్యక్షులుగా కేఎం కోదండపాణి మొదలియర్‌ను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నట్లు కార్యవర్గం తెలిపింది. కార్యనిర్వక అధ్యక్షులుగా ఎం.బాలసుబ్రమణ్యం ముఖ్య కార్యదర్శిగా ఎం రాజేంద్రరెడ్డి, కోశాధికారిగా ఎం కృష్ణస్వామి రాజు,ను ఎన్నుకున్నట్లు తెలిపారు. ఆలయ అధ్యక్షులు కోదండపాణి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తారన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గాన్ని పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఆలయ చైర్మన్ మోహన్ రాజు హేమాద్రి ప్రసాద్ రెడ్డి, శశిధర్ రెడ్డి రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా యేసు క్రీస్తు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోక్రిస్మస్ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ప్రార్థనా మందిరాలను సర్వాంగ సుందరంగా మంగళవారం రాత్రి విద్యుద్దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ చెట్టు గుర్చి క్రైస్తవ విశ్వాసులకు దైవ సేవకులు వివరించారు. రాత్రి 9 గంటలకు పలు కార్యక్రమాలు సామూహిక ప్రార్ధనలు చేపట్టారు. ప్రత్యేక ప్రార్ధనలతో రోజుని ప్రారంభించుకున్నారు. పండుగ పురస్కరించుకొని పలు చర్చిలలో హల్లెలూయ స్తుతి మహిమలు చెల్లించారు. క్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని పలువురు క్రైస్తవ సంఘాలలో ఏసుక్రీస్తు జన్మదిన విశిష్టతను గుర్చి అరిగెలకండ్రిగ కాలనీలోని సి.ఎస్.ఐ మందిరములో కేథలిక్స్ వేలూరు విల్సన్ సర్వోన్నతమైన స్థలములో దేవునికి మహిమయు ఆయనకు ఇష్టులైన మనుషులకు సమాధానము కలుగును గాక అని దేవుని స్తోత్రము చేయుచుండెను లూకా 2:14 బోధించెను. కాటూరు గ్రామంలో సిఎస్ఐ మందిరంలో లోకేశ్వర్ దావీదు పట్టణమందు నేడు రక్షకుడు పుట్టియున్నాడు. నీర్పాకోట గ్రామంలో బెతస్థ ప్రార్థన మందిరం నందు జాన్ పీటర్, ఈసీఐ మందిరంలో ఎం జైపాల్, జయసిలువ ప్రార్థన మందిరంలో, నేలపట్టు గ్రామంలోని సిఎస్ఐ పాస్టర్ ఆశీర్వాదం, పలు చర్చలలో దేవుని సందేశాన్ని అందించారు,శుభాకాంక్షలు తెలిపారు, క్రైస్తవ భక్తులు కొత్త బట్టలు ధరించి విశ్వాసంతో దేవుని నామాన్ని స్మరించారు. కొన్ని చర్చిలలో అన్నదానం వస్త్ర దానం చేశారు, సిఎస్ఐ ప్రొబిషన్ రెవరెండ్ కుమార్, భాస్కర్, క్రైస్తవ మందిరంలో శుభాకాంక్షలు తెలిపారు కేకులు కట్ చేశారు. స్వీట్లు పంచిపెట్టారు. సత్యవేడు నియోజకవర్గం జెసిఎస్ కన్వీనర్ వేలూరు రాకేష్ క్రైస్తవులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

అక్షర పాఠశాలలో మస్త్ మస్త్ క్రిస్మస్

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలోని అక్షర పబ్లిక్ పాఠశాలలో మంగళవారం రాత్రి విద్యార్థులకు శాంటా క్లాస్ వేషధారణలో పాఠశాల కరస్పాండెంట్ ముని ప్రతాప్ శాంతా క్లాస్ ఆయన పిల్లలకు ఇష్టమైన వ్యక్తి చరిత్రలో పుస్తకాలలో లిఖించబడి ఉన్నది. క్రిస్మస్ జన్మదినలో భాగంగా ప్రత్యేకంగా శాంతా క్లాస్ ఈ పేరు గురించి పెద్ద పరిచయం అవసరం లేదు. కానీ, ఇప్పుడు అందరూ చూస్తున్న శాంటా క్లాస్ గెటప్ కాపీ రైట్స్ కోకాకోలా కంపెనీవి వారు వెలుగులోకి తీసుకొచ్చారు క్రిస్మస్ ప్రపంచవ్యాప్తంగా జరుపుకునే పండుగ. క్రిస్మస్ సెలబ్రేషన్స్ టైంలో ఎక్కువగా మనకు కనిపించేది శాంటా క్లాస్ గెటప్. 1923 కంటే ముందు శాంటా క్లాజ్‌కు ఓ రూపం లేదు. కానీ తర్వాత శాంటా క్లాస్ ఎలా ఉంటాడంటే ఎవ్వరైనా చెప్పగలుగుతున్నారు. దీనిపై విద్యార్థులకు క్షుణంగా తెలియపరిచారు. కార్యక్రమంలో విద్యార్థులు శాంత క్లాస్ వేషధారణలో తల్లిదండ్రులను పలువురిని సంతోష పెట్టారు. ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తిలో బుధవారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం అర్ధరాత్రి యేసు జననాన్ని స్వాగతిస్తూ ప్రారంభమైన వేడుకలు మరుదినం అంతా కొనసాగాయి. చర్చిల్లో క్రీస్తు నామస్మరణ మార్మోగింది. క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు. చర్చిల్లో పాస్టర్లు పవిత్ర బైబిల్ చదివి క్రీస్తు సందేశాన్ని వినిపించారు. వాక్య పరిచర్య చేశారు. పలువురు చిన్నారులు శాంతాక్లాజ్ వేషధారణలో నిర్వహించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. కాగా పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నేతలు క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

మా భూములు తక్కువ రేటుకు ఇచ్చేది లేదు

సూళ్లూరుపేట ఆర్డీవోకు తేల్చి చెప్పిన రైతులు

విశాలాంధ్ర- సత్యవేడు:సాగు చేసుకుంటున్న మా భూములను తక్కువ ధరకు ఇవ్వాలేమంటూ పలువురు రైతులు ఆర్డీఓ కిరణ్మయికి తేల్చి చెప్పారు. బుధవారం సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయంలో సత్యవేడు తహసిల్దార్ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో ఆర్డీవో కిరణ్మయి భూసేకరణకు సంబంధించి పరిహారపు చెల్లింపు నిర్ధారణపై పలువురు రైతులతో సమావేశం నిర్వహించారు.ఈ నేపథ్యంలో పరిహారం నిర్ధారణపై రైతులు వారి అభిప్రాయాలను ఆర్డీవో ఎదుట కుండబద్దలు కొట్టారు.ఎకరాకు 35 లక్షల రూపాయలు పరిహారం చెల్లిస్తే తప్ప భూములు ఇచ్చేది లేదన్నారు.ప్రస్తుతం రిజిస్ట్రేషన్ బేసిక్ విలువ 25 లక్షల రూపాయలు ఉన్నట్లు పేర్కొన్నారు. అందుకని రైతునుంచి భూములు తీసుకునేటప్పుడు అధికారులు ఉదారంగా వ్యవహరించి పరిహారం చెల్లించాలన్నారు.నిరుపేద,మధ్యతరగతి రైతులను దృష్టిలో ఉంచుకొని పరిహారం చెల్లింపుపై సానుకూల నిర్ణయం అధికారులు తీసుకోవాలని అన్నారు. అయితే ఎకరాకు ఇరవై ఒక్క లక్షలు పరిహారంగా చెల్లిస్తామని ఈ సందర్భంగా ఆర్డీవో కిరణ్మయి రైతులకు స్పష్టం చేసినట్లు సమాచారం.భూరిజిస్ట్రేషన్లో బేసిక్ విలువ 18 లక్షలు మాత్రమే ఉన్నట్టు ఆమె చెప్పినట్టు తెలిసింది.ఈ క్రమంలో దీన్ని కూడా పెంచి ఎకరాకు 21 లక్షల రూపాయలు పరిహారంగా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అయితే ఈ భూ పరిహారపు నిర్ధారణపై రైతుల అంగీకారం చలేదు.పైగా పరిహారం నిర్ధారణకు సంబంధించి తమ అభిప్రాయాలను జిల్లా కలెక్టర్కు నివేదించాలని రైతులు పలువురు ఆర్డీవోకు ఒక విన్నవించారు.వీలైతే తామే దీనిపై కలెక్టర్ వెంకటేశ్వర్ ను కలిసి చర్చిస్తామని రైతులు స్పష్టం చేశారు.కాగా పారిశ్రామిక వాడ మరింత విస్తరించాలని ఉద్దేశంతో ప్రభుత్వం భూ సేకరణ ప్రక్రియకు శ్రీకారం చుట్టింది.ఇందులో భాగంగానే కొల్లడం,పెద్దఈటిపాకం, చిన్న ఈటిపాకం, ఇరుగులం తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారుల బృందం భూసర్వే చేశారు.ఈ క్రమంలో దాదాపు 100 ఎకరాలకు సంబంధించి నోటిఫికేషన్ జారీ అయ్యాయి.ఈ నోటీసులను రెవెన్యూ సిబ్బంది ద్వారా రైతులకు అందజేస్తున్నారు. ఈ సమావేశంలో టిడిపి మండల అధ్యక్షులు,రైతు ప్రవీణ్ కుమార్ రెడ్డి,జిల్లా మాజీ జడ్పీ వైస్ చైర్మన్ సుందర్ రామిరెడ్డి,శ్రీరామచంద్రారెడ్డి,మనిశెట్టి,రఘు తదితర రైతులు పాల్గొన్నారు.

తిరుపతి షెకీనా చర్చిలో ఘనంగా క్రిస్మస్ ఆరాధన

ముఖ్య అతిథిగా పాల్గొన్న తిరుపతి ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు

విశాలాంధ్ర-తిరుపతి: బుధవారం తిరుపతి కె.బి.లేఔట్ సందుగల షెకీనా చర్చిలో ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు క్రిస్మస్ ఆరాధనలు జరిగాయి. ముఖ్య అతిథిగా స్థానిక ఎంఎల్ఏ ఆరని శ్రీనివాసులు పాల్గొని క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుతూ, క్రైస్తవులను ఉద్దేశించి మాటాడారు. తనకు క్రైస్తవులతో 40 సంవత్సరములు మంచి అనుబంధం ఉందని అన్నారు. వారికి సమస్య వచ్చినా వారికి అండగా ఉంటానని తెలుపుతూ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రభుత్వం క్రైస్తవులకు అనేక సంక్షేమ పథకాలు తెచ్చారన్నారు. సీనియర్ పాస్టర్. అరుల్ అరసు మాట్లాడుతూ యేసు గొప్పదనాన్ని వివరించారు. క్రిస్మస్ సందర్భంగా చర్చి లో యువతి యువకులు ప్రత్యేక క్రిస్మస్ గీతాలాపన చేయగా, వందలాది క్రైస్తవులు పాల్గొని పరస్పర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ ఎస్సి కార్పొరేషన్ డైరెక్టర్ కుమారమ్మ, జనసేన పార్టీ 38 వ డివిజన్ అధ్యక్షులు ఆర్.చంద్ర శేఖర్ (చందు), చర్చి పెద్దలు మోషే, రఘు, దయాలన్, జోయల్ పాల్గొన్నారు.

దేవాంగ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో కాలపట్టిక ఆవిష్కరణ

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడులో దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాల పట్టికలను ఆవిష్కరించారు. బుధవారం దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు జక్కుల పాండురంగయ్య ఆధ్వర్యంలో సంఘం సభ్యులు పలువురు కాల పట్టికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాండురంగయ్య మాట్లాడుతూ దేవాంగ సంక్షేమ సంఘం కేవలం సేవా కార్యక్రమాలు కాకుండా కాల పట్టికలను ముద్రించి పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రధానంగా ఏ శుభకార్యం నిర్వహించాలన్న ప్రతి ఒక్కరికి కాల పట్టిక అవసరమన్నారు.దీన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఏడాది క్యాలెండర్ను ఆవిష్కరి స్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి యారాశి. మురళీకృష్ణ,ఉపాధ్యక్షుడు మన్నె. గణపతి,కోశాధికారి పోజాల. రవిబాబు, సంయుక్త కార్యదర్శి మాచర్ల. చెంచులయ్య, కార్యవర్గ సభ్యులు మన్నే.అయ్యప్ప, సల్ల.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్లైన్ గేమ్కు ఒక యువకుడు బలి

విశాలాంధ్ర-పుంగనూరు: ఆన్లైన్ గేమ్ కు ఒక యువకుడు బలి అయిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది వివరాలు ఇలా ఉన్నాయి పట్టణంలోని ఏవి రావు వీధిలో నివాసం ఉండే రెడ్డప్ప కుమారుడు శ్రీనివాసులు డిగ్రీ చదువుతున్న యువకుడు గత రాత్రి తన నివాసంలో అర్ధరాత్రి వరకు తన సెల్ ఫోన్లో ఆన్లైన్ గేమ్ ఆడుతుండగా మెలుకువ వచ్చిన తల్లి చూసి మందలించడంతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీనివాసులు అర్ధరాత్రి అందరూ నిద్రపోతుండగా ఇంటిలో నుండి పారిపోవడం జరిగింది. ఉదయాన్నే తల్లితండ్రులు తమ బిడ్డ ఆచూకీ కోసం వాడవాడలా గాలిస్తుండగా మినీ బైపాస్ రోడ్డులో ఉన్న కోనేరు ఎదుట తన చెప్పులు ఉన్నట్లు గుర్తించారు. దీనితో కోనేరులోనే పడి ఉంటాడని అనుమానంతో స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఫైర్ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఫైర్ స్టేషన్ ఆఫీసర్ సుబ్బరాజు ఆధ్వర్యంలో కోనేరులో ఫైర్ సిబ్బంది శ్రీనివాసులు ఆచూకీ కోసం గజ ఈతగాళ్ళ సహాయంతో గాలించగా శ్రీనివాసులు మృతదేహం లభించింది. మృత దేహాన్ని పంచనామా నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. దీనిపై అర్బన్ సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.బిడ్డ మృతదేహం లభ్యంకావడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

ఘనంగా అటల్ బీహార్ వాజ్ పాయ్ జయంతి

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి మండల భార తీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు చంద్రగిరిలో ఘనంగా మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్ పాయ్ 100వ జయంతి వేడుకలు జరుపుకున్నారు. వాజ్ పాయ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలు పంచుకొని జయంతి వేడుకలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటముని మాట్లాడుతూ అటల్ బీహార్ వాజ్ పాయ్ పేద ప్రజలకోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. గ్రామీణ సడక్ యోజన, జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం, అటల్ జి పెన్షన్ యోజన, సర్వ శిక్ష అభియాన్, సుకన్య యోజన, దీన దయాల్ ఆవాస్ యోజన మొదలగు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు టి. సుబ్రమణ్యం యాదవ్, బిజెపి సీనియర్ నాయకులు మునిగంగి రెడ్డి, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ సునీల్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ నాయుడు, ఇందు శేఖర్, టీవీ ప్రసాద్, హనుమంత నాయుడు కార్యకర్తలు పాల్గొన్నారు.

వేదనారాయణస్వామి ఆలయంలో

శరవేగంగా మరమ్మత్తు పనులు

మూలవిరాట్ స్వామి దర్శనం కోసం భక్తులు ఎదురుచూపు

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు నియోజకవర్గం నాగలాపురం టిటిడి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న శ్రీవేదనారాయణస్వామి ఆలయంలో మరమ్మత్తు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆలయంలో ప్రధాన గర్భాలయంతో పాటు,ఉపదేవత మూర్తులు కొలువైన పలుచోట్ల మరమ్మతుకు గురయ్యాయి.ఈ నేపథ్యంలో దీనిపై టిటిడి అధికారులు దృష్టి సారించారు.ఇందులో భాగంగానే మరమ్మత్తు పనుల కోసం 2023 డిసెంబర్లో బాలాయం ప్రక్రియకు శ్రీకారం చుట్టి స్వయంభుగా వెలసి భక్తుల నిరాజనాలు అందుకుంటున్న వేద నారాయణస్వామి ఆలయ గర్భాలయాన్ని తత్కాలికంగా మూసివేశారు. ప్రత్యామ్నాయంగా భక్తుల దర్శనార్థం శ్రీవేద నారాయణస్వామి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. ఆలయంలో ఇప్పటివరకు మూలవిరాట్ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేదనారాయణస్వామి గర్భాలయం అమ్మవారు, వరాహస్వామి, భక్తఆంజనేయ, లక్ష్మీనరసింహస్వామి, శ్రీరాములు వంటి ఉపదేవత మూర్తులకు సంబంధించి మరమ్మతు పనులు పూర్తి కావడం జరిగింది.ఈ క్రమంలో గర్భాలయాల్లో అడుగుభాగం,ఆలయంపైకప్పు బాగు చేశారు. దీంతోపాటు హయగ్రీవస్వామికి ప్రత్యేకంగా ఉప ఆలయాన్ని నిర్మించారు.ఇదేగాక భక్త ఆంజనేయ స్వామికి విమాన గోపురాన్ని నిర్మించారు.ఆలయంపైకప్పు పూర్తిస్థాయిలో మరమ్మత్తు చేసి బాగు చేయడం జరిగింది.ఇక స్వామి విమాన గోపురాలకు బంగారు పూత పనులు జరగాల్సి ఉంది.ఇందులో ఐదు కలశాలకు 9 పర్యాయాలు బంగారు పూత పనులు జరగాల్సినట్టు నాగలాపురం ఆలయ కార్యనిర్వాహణాధికారి చెంగల్ రాయలు పేర్కొన్నారు.బంగారు పూత పనులు పూర్తి కావాలంటే మరికొంత సమయం పడుతుందని ఆయన చెప్పారు.కాగా వేదనారాయణస్వామి ఆలయంలో చేపట్టిన మరమ్మతు పనులు పూర్తయితే దేదీప్యమానంగా వెలుగొందుతుందని భక్తులు చెబుతున్నారు.తమిళనాడు కుంభకోణం నుంచి శిల్ప కళాకారుల బృందం ఆధ్వర్యంలో ఆలయ మరమ్మతు పనులు కొనసాగుతోంది.ఈ ఆలయంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేదనారాయణస్వామి మత్స్యవతారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు.అయితే ఏది ఏమైనా మూలవిరాట్ స్వయంభు శ్రీవేదనారాయణస్వామి దర్శనం కోసం భక్తులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు.ఇప్పటికైనా సంబంధిత టీటీడీ ఉన్నతాధికారులు స్పందించి ఆలయంలో కొనసాగుతున్న మరమత్తు పనులను వేగవంతం చేయడానికి చర్యలు తీసుకొని పూర్తి చేయించాలని స్థానిక భక్తులు కోరుతున్నారు.

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో

బీసీలకు సముచితస్థానం: రుద్రకోటి సదాశివం

విశాలాంధ్ర - చంద్రగిరి: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే బీసీలకు సమితి స్థానం లభించిందని ఆంధ్రప్రదేశ్ నాయి బ్రాహ్మణ వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం అన్నారు. నాయి బ్రాహ్మణ సామాజిక వర్గ సభ్యులతో మంగళవారం చంద్రగిరిలో సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన రుద్రకోటి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్లో నాయి బ్రాహ్మణ సామాజిక వర్గాన్ని గుర్తించిన మహానుభావుడు విశ్వవిఖ్యాత నటసార్వభౌమ పద్మశ్రీ ఎన్టీ రామారావు అని కొనియాడారు. రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాలను నిరంతరం ఆలోచించే నేత నారా చంద్రబాబు నాయుడని ఆయన హయాంలో అనేకమైన బీసీ సంక్షేమ పథకాల ప్రవేశపెట్టి బీసీలను రాజకీయంగా ఆర్థికంగా ఆదుకున్న ఘనత ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తెలిపారు. బడ్జెట్లో బీసీల సంక్షేమానికి సుమారు 38 వేల కోట్లు ప్రవేశ పెట్టడం జరిగింది, నాయి బ్రాహ్మణ సామాజిక వర్గం అర్హులైన సభ్యులందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలపరుస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ సామాజిక వర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకలలో చల్లా రామచంద్రారెడ్డి

విశాలాంధ్ర-పుంగనూరు: పట్టణంలోని టిడిపి రాష్ట్ర క్రిస్టియన్ సెల్ కార్యదర్శి గిరిబాబు ఆధ్వర్యంలో తన నివాసం వద్ద క్రిస్మస్ వేడుకలను ఘనంగా ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వేడుకలలో నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి పాల్గొనడం జరిగింది. ఈ వేడుకలలో చర్చి ఫాదర్లు ప్రత్యేక ప్రార్ధనలు చేసి చల్లా రామచంద్రారెడ్డి అలాగే గిరిబాబు కుటుంబాన్ని ఆశీర్వదించడం జరిగింది. ఈ సందర్భంగా చల్లా రామచంద్రారెడ్డి మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. వాడవాడల క్రిస్టియన్ సోదరులంతా క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. ఏసుప్రభు ఆశీస్సులతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన కోరారు. అదేవిధంగా ఏసుప్రభు ఆశీస్సులతో కూటమి ప్రభుత్వం ఎలాంటి ఇబ్బంది లేకుండా విజయవంతంగా నడపాలని రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు మాధవరెడ్డి మహిళా అధ్యక్షురాలు జనసేన మండల పార్టీ అధ్యక్షులు విరుపాక్షి, ప్రధాన కార్యదర్శి పగడాల రమణ, ఉమాదేవి, శ్రీకాంత్, సివి రెడ్డి సయ్యద్, సుహేల్ భాష, సద్దాం హుస్సేన్, వెంకట మునియాదవ్ రామకృష్ణంరాజు, చదల వెంకటరెడ్డి, చంద్రశేఖర్, గంగాధర్, బీమ గానిపల్లి రమణ ,కోలాట రమణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి ఆనంతో గుడ్లూరు మయూర్ భేటీ

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని నెల్లూరులో బుధవారం ఎంజీఎం గ్రూప్స్ డైరెక్టరు గుడ్లూరు మయూర్ మర్యాద పూర్వకంగా కలిశారు. శ్రీకాళహస్తిలో శివం టు శివం రోడ్డు మంజూరు చేసినందుకు ఈ సందర్భంగా ఆయనకు కృతజ్ఞతలు తెలియచేశారు. ముక్కంటి ఆలయ అభివృద్ధికి దేవదాయశాఖ కట్టుబడి ఉందని ఆనం రామనారాయణరెడ్డి ఈ సందర్భంగా గుడ్లూరు మయూర్ తో చెప్పారు. ఇందుకు స్థానిక శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి సహకారం తీసుకుంటామన్నారు.

కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత

పల్లిపట్టు నాగరాజుకు సాహితీ పురస్కారం

విశాలాంధ్ర- సత్యవేడు:కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజుకు సాహితీ పురస్కారం ప్రదానం చేశారు.బుధవారం తిరుపతి యూత్ హాస్టల్లో తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు.ఈ నేపథ్యంలో ముగ్గురు రచయితలకు సాహితీ పురస్కారాలు ప్రదానం చేయడం జరిగింది.ఇందులో భాగంగానే వరదయ్యపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయులు,కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజును రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు సాకం నాగరాజు,మన్నవ గంగాధర్ ప్రసాద్ సాహితీ పురస్కారంతో సత్కరించి 5 వేల రూపాయలు నగదు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం నాయకులు గార్లపాటి దామోదరనాయుడు, తోట వెంకటేశ్వర్లు, తమటం రామచంద్రారెడ్డి, జయరాం ప్రసాద్,యువశ్రీ మురళి, శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్య,పురుషోత్తమాచారి తదితరులు పాల్గొన్నారు.

వాజపేయి సేవలు చిరస్మరణీయం

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: భారత మాజీ ప్రధాని, భారత రత్న అటల్ బిహారీ వాజపేయి సేవలు చిరస్మరణీయమని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని బుధవారం అటల్ బిహారీ వాజపేయి శత జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా వాజపేయి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వాజపేయి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా కోలా ఆనంద్ మాట్లాడుతూ... వాజపేయి గొప్ప రాజ నీతిజ్ఞుడు అన్నారు. ఆయన రాజ నీతిజ్ఞత జాతికి ప్రగతి బాటని ఆనంద్ చెప్పారు. ప్రధానిగా వాజపేయి చెరగని ముద్ర వేశారన్నారు. దేశాన్ని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించిన ఘనత వాజపేయికే దక్కుతుందన్నారు. ఆయన ఏనాడూ అవకాశవాద రాజకీయాలు చేయలేదన్నారు. మనమందరం వాజపేయి అడుగు జాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి మేళాగారం సుబ్రహ్మణ్యంరెడ్డి, పట్టణ అధ్యక్షులు గరికపాటి రమేష్ బాబు, ఎస్సీ రమణ, పుణ్యం ఢిల్లీ కుమార్, లింగాబత్తిన గోపాల్, అమర్, సజ్జల హరీష్, భరత్ నాయుడు, హరీష్ రెడ్డి, జజాల మురళీ, ఈమిడిసెట్టి మోహన్, దక్కిలి శివ, నాగశేషు, ఈదురు సురేష్, కొప్పల వాసు, సురేష్, నాని, సిద్ధూ, సాయి, తులసి తదితరులు పాల్గొన్నారు.

అయ్యా..! నాకు న్యాయం చేయండి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: "నేను నేలను నమ్ముకుని బతుకుతున్న. ఆ నేలే నాకు జీవనాధారం. ఆ నేలపై నాకు సర్వ హక్కులున్నాయి. అయినా పదేళ్లగా ఆ నేలలోకి నన్ను అడుగు పెట్టనివ్వడం లేదు. దశాబ్ద కాలంగా న్యాయం కోసం తిరుగుతున్న. అయినా ఎవరూ న్యాయం చేయలేదు. నా సమస్య మీడియా ద్వారా బయటకు వస్తే న్యాయం జరుగుతుందని చిన్ని ఆశ. అందుకు ఇక్కడకు వచ్చాను" అంటూ ఓ అన్నదాత బుధవారం శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ లో కంటనీరు పెట్టారు. ఆయన సమస్య ఆయన మాటల్లోనే. శ్రీకాళహస్తి మండలం భీమవరం గ్రామానికి చెందిన గోవిందు మధ్య తరగతి రైతు. 1992లో ఈయన బి.వెంకటసుబ్బయ్య అనే భూస్వామి వద్ద భీమవరం రెవిన్యూలో సర్వే నెంబరు: 56/3లో ఖాతా నంబరు:356 లోని 24 సెంట్ల భూమిని కొనుగోలు చేశాడు. ఆ భూమికి సంబందించిన మూల పత్రాలు, సాక్షి సంతకాలు ఉన్నాయి. 2003లో ఈ భూమి రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఈ విషయం గ్రామస్తులందరికీ తెలుసు. గ్రామస్తులు ఎవరూ భూస్వాములైన వెంకటసుబ్బయ్య, పోలయ్య, శంకరయ్యకు ఎదురు చెప్పలేని పరిస్థితి. ఇదే అదనుగా గోవిందును వారు పదేళ్లుగా భూమిలోకి రానివ్వడం లేదు. భూమి వద్దకు వెళితే గొడవకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో న్యాయం కోసం రెవిన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయించారు. అయినా ఎవరూ న్యాయం చేయలేదు. ఆ భూస్వాములు రాజకీయ పలుకుబడితో న్యాయానికి సమాధి కడుతున్నారు. శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకటసుధీర్ రెడ్డి జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని గోవిందు వేడుకుంటున్నారు. తనచకు ముగ్గురు పిల్లలని... భూమి పోతే వారి బతుకు బజారున పడుతుందని గోవిందు ఆందోళన చెందుతున్నాడు. అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి తన కుటుంబానికి న్యాయం చేయాలని గోవిందు వేడుకుంటున్నాడు.

నాగరాజును సత్కరించిన మాజీ ఎంపీపీ

విశాలాంధ్ర -పిచ్చాటూరు : పిచ్చాటూరు ప్రెస్ క్లబ్ నందు ఈరోజు క్రిస్మస్ దినాన ఎస్సీ సెల్ నాయకుడు నాగరాజ్ జన్మదిన సందర్భంగా వారిని నారాయణవనం మండలం మాజీ ఎంపీపీ గోవిందస్వామి శాలువా కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో యువ నాయకుడు ముఖేష్ విలేఖరి గోవిందరాజులు ఎలుమలై మరియు జనసేన నాయకులు సుగంధర్ అడ్వకేట్ పాండియన్ మరియు అభిమానులు యువకులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయ్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర -చిత్తూరు: దివంగత మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పెయ్ శత జయంతిని పురస్కరించుకుని బిజెపి చిత్తూరు సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు షణ్ముగం ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలోని గాంధీ విగ్రహం వద్ద ఆ పార్టీ శ్రేణులు వాజ్పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘననివాళి అర్పించారు. ఈ సందర్భంగా వాజ్ పేయ్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. దేశవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సిసి రోడ్లు వేసిన ఘనత ఆయనకే దక్కిందని తెలిపారు.ఈ సందర్భంగా బిజెపి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు చేతుల మీదుగా పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలోమాజీ ఎంపీ దుర్గా రామకృష్ణ, అట్లూరి శ్రీనివాసులు, రామభద్ర,ఎస్సీ మోర్చా నాయకులు బాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాజ్‌పేయి శత జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పుంగనూరు: భారతదేశ మాజీ ప్రధాని అటల్ బీహర్ వాజ్పాయ్ శత జయంతి వేడుకలను జిల్లా బిజెపిఎస్సీ మోర్చా అధ్యక్షులు నరసింహులు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు 100 సంవత్సరాల జన్మదినం సందర్భంగా పార్టీ నాయకులు కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేయడం జరిగింది ఈ సందర్భంగా నరసింహులు మాట్లాడుతూ మాజీ ప్రధాని అటల్ బీహర్ వాజ్పేయి దేశానికి ఎంతో సేవ చేస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందించడం జరిగిందన్నారు .ఆయన ప్రధానిగా ఉన్నప్పుడు దేశంలో ఎన్నో సంస్కరణలు తీసుకువచ్చి బడుగు బలహీన వర్గాలకు న్యాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు బాబు జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు మల్లికా రాణి సీనియర్ నాయకులు టీఎస్ ప్రసాద్ జగన్నాథం కుట్టి ఉమాశంకర్ లాయర్ ప్రసాద్ అరవపల్లి వెంకట్రెడ్డి శ్రీనివాసులు రాఘవ భాస్కర అమర్నాథ్ యాదవ్ దిలీప్ కుమార్ మహేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో

క్రిస్మస్ కానుకల పంపిణీ

విశాలాంధ్ర - కుప్పం: బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు కుప్పంలోని షాలోమ్ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ప్రార్థనకు హాజరయిన వారికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రిస్మస్ కానుకలను పంపిణీ చేసారు. ఈ కార్యక్రమం లో బిసిఎన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డా. సునీల్ రాజ్, సాగర్ రాజ్ పాల్గొన్నారు. బిసిఎన్ విద్యాసంస్థల అధినేత బిసి నాగరాజు ను చర్చి ఫాస్టర్స్ వి. సుబ్రహ్మణ్యం, పార్థిబన్‌లు ఘనంగా సన్మానించారు.

విశాలాంధ్ర 2025 క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర-పుంగనూరు: విశాలాంధ్ర దినపత్రిక 2025 నియోజకవర్గ నూతన క్యాలెండర్ను టిడిపి ఇన్చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి బుధవారం రోజున ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాలాంధ్ర దినపత్రిక కు సమాజంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు ఆనాడు స్వతంత్ర ఉద్యమంలో బ్రిటిష్ వారిని తరిమికొట్టడంలో విశాలాంధ్ర దినపత్రిక ఉద్యమానికి తోడుపాటును అందించిందన్నారు. ఎప్పటికప్పుడు ప్రజా సమస్యలను ఎత్తు చూపుతూ ప్రజలకు ప్రభుత్వానికి వారిదిగా పనిచేస్తుందన్నారు. అలాంటి దినపత్రిక 2025 నూతన క్యాలెండర్ ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాధవరెడ్డి, జనసేన మండల పార్టీ అధ్యక్షులు విరుపాక్షి, టిడిపి మహిళా అధ్యక్షురాలు ఉమాదేవి పై మాన్ కమిటీ మెంబర్లు సయ్యద్ సుహేల్ భాష సివిరెడ్డి రామకృష్ణ రాజు నాయకులు వెంకట ముని యాదవ్ భీమ్ గాని పల్లి రమణ కూటమి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి కృషి

విశాలాంధ్ర-రామసముద్రం : ఆలయాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని మదనపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు జునైద్ అక్బర్ తెలిపారు బుధవారం రామసముద్రం మండలంలోని అరికెల పంచాయితీ గౌని వారి పల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్నాడు గ్రామస్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తామని చెప్పారు కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి హనుమంత్ రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమ కరుణ సేవకు ప్రతీక క్రిస్మస్ పండుగ

విశాలాంధ్ర-గాలివీడు: ప్రేమ కరుణ సేవకు ప్రతీక క్రిస్మస్ పండుగ అని క్రైస్తవ మత పెద్దలు పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని కర్మెల్ ప్రార్థన మందిరంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీస్తు తాను నమ్మిన వారి కోసం బలిదానాలకు సైతం వెనుకాడని గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ప్రతి ఒక్కరూ శాంతి మార్గాన్ని అనుసరించి,ప్రేమ తత్వాన్ని అలవర్చుకోవాలని సూచించారు. ఈర్ష ద్వేషాలను పూర్తిగా పక్కన పెట్టాలని పాపాలకు దూరంగా ఉండాలని క్రీస్తు సూచించిన మార్గాలను అనుసరించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రత్నం,జయన్న,విశ్వాసులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో భూపేష్ రెడ్డి

విశాలాంధ్ర - జమ్మలమడుగు : జమ్మలమడుగు మండలం దానవులపాడు గ్రామంలో క్రిస్మస్ పండుగ సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమంలో జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ భూపేష్ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వమానవాళికి శాంతి సందేశాన్నిచ్చిన యుగకర్త ఏసుక్రీస్తు జన్మదినం ప్రపంచానికి పండుగ దినం అని తెలిపారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా క్రైస్తవ సోదర సోదరీమణులకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

వాడ వాడలా ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర - జమ్మలమడుగు: క్రిస్మస్ పర్వదినం సందర్భంగా జమ్మలమడుగు మండలంలోని అన్ని చర్చిలలో బుధవారం క్రైస్తవులు వేడుకలు ఘనంగా నిర్వహించారు. జమ్మలమడుగు పట్టణంలోని టౌన్ చర్చి నందు క్రైస్తవులు అత్యంత భక్తిశ్రద్ధలతో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. అందులో భాగంగా ఉదయం 6 గంటలకు ఆరాధన ప్రార్థనతో టిసిసి సంఘం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు సంఘం సెక్రెటరీ బి.రాజు, ట్రెజర్ ఎం.శాంతయ్య, సంఘ పెద్దలు సుందరమ్మ తెలిపారు. టిసిసి పాస్టర్ నతనీయేలు క్రైస్తవ వాక్య సందేశం అందించారు ప్రతి ఒక్కరూ ఏసు మార్గంలో నడవాలని ఆయన తెలిపారు. క్రిస్మస్ సందర్భంగా పట్టణంలోని అనాథలకు, అభాగ్యులకు భోజనం మరియు దుస్తులను పంపిణీ చేసినట్లు టిసిసి సంఘ పెద్దలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవ సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు మానవాళికి మార్గదర్శం

ఎమ్మెల్యే మహమ్మద్ షాజహాన్ బాషా

విశాలాంధ్ర-మదనపల్లె: ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయమని, ఆయన జన్మదినం సర్వ సృష్టికి పర్వదినమని ఎమ్మెల్యే షాజహాన్ బాషా అన్నారు. క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక జెసిఎం చర్చ్, ఆరోగ్యవరంలోని చర్చ్, చిత్తూరు బస్టాండ్ లోని చర్చిలలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రైస్తవ సోదర, సోదరీమణులందరికీ ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. జీసస్ పుట్టినరోజును ప్రపంచవ్యాప్తంగా క్రైస్తవ సోదరులు క్రిస్మస్ పండుగ జరుపుకుంటారని ఆయన తెలిపారు. ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని, తన బోధనల ద్వారా మానవాళికి సన్మార్గం వైపు నడిపించేలా ఏసుక్రీస్తు మార్గ నిర్దేశం చేశారని ఆయన పేర్కొన్నారు.నిస్సహాయులపై కరుణ, సాటివారిపై ప్రేమ, క్షమ, సహనం, దాతృత్వం, త్యాగం ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి ఏసుక్రీస్తు అందించిన మహోన్నత సందేశాలని ఆయన అన్నారు. ఎల్లప్పుడూ ఆ కరుణామయుని ఆశీస్సులు, దీవెనలు, ప్రజలపై ఉండాలని ఎమ్మెల్యే షాజహాన్ భాష ఆకాంక్షించారు. విశ్వశాంతి కోసం అందరం పునరంకితం కావాలని ఆయన పిలుపునిచ్చారు. క్రీస్తు జననం సర్వమానవాళికి మహోదయమని, రక్షణ వరమని కూడా ఆయన పేర్కొన్నారు. క్రిస్మస్ పండుగ ను ప్రతి ఒక్కరూ సంతోషాలతో జరుపుకోవాలని, ఈ పర్వం విశ్వ మానవాళి జీవితాలలో సుఖసంతోషాలను అష్టైశ్వర్యాలను, శాంతిని, ప్రగతిని తీసుకొని రావాలని ఆయన దైవాన్ని ప్రార్థించారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

విశాలాంధ్ర-సిద్ధవటం: బాకరాపేట, సిద్ధవటం, ఎస్ రాజంపేట, వెలుగు పల్లి, మోదిన్, సాహెబ్ పల్లి, నిర్మలగిరి కాలనీ మరికొన్ని గ్రామాల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా బుధవారం ఘనంగా జరిగాయి. కడప చెన్నై జాతీయ రహదారి నిర్మలగిరి కాలనీ వద్ద వెలసిన చర్చిలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ఫాదర్, నెల్ వన్ ప్రత్యేక ప్రార్థనలు చేసి క్రీస్తు యొక్క ఉప సందేశాలు తెలియజేశారు సంఘమిత్ర, ఫౌండేషన్ అధ్యక్షులు, ఫి రా జిద్దిన్ మాట్లాడుతూ చర్చి చుట్టూ కాంపౌండ్ నిర్మాణానికి,50 వేల,రూ, అభివృద్ధి కొరకు అందిస్తామని తెలియజేశారు క్రైస్తవ మహిళలకు 300 చీరలు పంపిణీ చేశారు. అనంతరం ఆయనకు చర్చి ఫాదర్ ఘనంగా శాలువతో సత్కరించారు వచ్చిన క్రైస్తవ సోదరులకు అన్నప్రసాదాలు ఏర్పాటు చేశారు ఈ కార్యక్ర మంలో,న్యాయవాది, ఇమ్మానియన్, మేము సైతం నిర్వాహకులు అయ్యవారయ్య, అక్కి శెట్టి వెంకటరత్నం క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

దేశక్షేమాన్ని కాంక్షించిన స్వాప్నికుడు వాజ్ పేయి

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: అనుక్షణం భారతదేశ క్షేమాన్ని కాంక్షించిన స్వాప్నికుడు అటల్ బిహారీ వాజపేయి అని బిజెపి సీనియర్ నాయకులు విటి చంగల్ రెడ్డి,ఊటుకూరు చలపతి, బత్తల సుబ్రమణ్యం కొనియాడారు.వాజ్ పేయి శత జయంతి సందర్భంగా బుధవారం ఉదయం బిజెపి నాయకులు వాక్కర్ల సుబ్బారావు అధ్వర్యంలో వాజ్ పేయి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాజ్ పేయి 25 డిసెంబర్ 1924 లో మహారాష్ట్ర లోని గ్వాలియర్ లో కృష్ణదేవి, కృష్ణ బిహారి వాజ్ పేయి దంపతులకు జన్మించారన్నారు. రాజకీయ జీవితంలో ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ రాజనీతికి నిలువుటద్దంలా నిలిచారన్నారు.సామాన్య మధ్య తరగతి స్థాయి నుంచి ప్రధాన మంత్రి స్థాయికి ఎదిగారన్నారు. ఉన్నత విలువలతో ఎదిగార న్నారు.ఆయన రాజనీతిజ్ఞత జాతికి ప్రగతి బాట వేశారని కొనియాడారు. సుపరిపాలనకు నిజమైన భాష్యం చెప్పిన పాలనా దక్షడని కొనియాడారు.కర్తవ్య నిర్వహణలో భాధ్యత మాటలతో కట్టి పడేసిందన్నారు.ఈ కార్యక్రమంలో వెంకటరమణ, శంకర్ రాజు తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

పోరుబాట పోస్టర్ విడుదల

విశాలాంధ్ర - జమ్మలమడుగు: కరెంటు చార్జీలు బాదుడుపై వైయస్సార్సీపి పోరుబాట పోస్టర్ ను విడుదల చేసినట్లు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం జమ్మలమడుగు పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైసీపీ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలతో కలిసి పోరుబాట పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిధర్ రెడ్డి మాట్లాడుతూ వైయస్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు విద్యుత్ చార్జీలపై పోరుబాట కార్యక్రమం జమ్మలమడుగు లో నిర్వహిస్తున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడవక ముందే కరెంటు చార్జీలను పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరు నెలలకే రాష్ట్ర ప్రభుత్వం 15000 కోట్లు అధిక చార్జీలు పెంచి ప్రజలపై భారం మోపుతున్నాయన్నారు. దీనికి నిరసనగా ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు జమ్మలమడుగు పట్టణంలోని సాయిరాం థియేటర్ దగ్గర నుండి ర్యాలీగా జమ్మలమడుగు పట్టణంలోని విద్యుత్ కేంద్రం వద్దకు చేరుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ, కన్వీనర్లు ధన్వాడ మహేశ్వర్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, కౌన్సిలర్ పోచిరెడ్డి, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

అబ్బురపరిచే సాహసం హేమంత్‌కే సాధ్యం

ఎమ్మెల్యే షాజహాన్ బాషాచే ప్రసంశ పత్రం, మెడల్, మూమెంటో అందజేత

విశాలాంధ్ర-మదనపల్లె: తాత మురళి మెడికల్స్ మురళి, తల్లిదండ్రుల డిఎం. అభినయ్ కాంత్ బి.నిరూప ప్రోత్సాహం, కరాటే మాస్టర్ శిక్షణతో 6 సంవత్సరాల అతి చిన్న వయసులో డిఏ.హేమాంష్ కరాటేలో బ్లాక్ బెల్ట్ సాధించి పలు సాహసాలు చేసి వన్ సైడ్ డాన్ ఎక్సర్ సైజ్ ను ఒక నిమిషంలోనే 100 కు పైగా చేసి రికార్డు కైవసం చేసుకోవడం ప్రశంసనీయం అని ఎమ్మెల్యే షాజహాన్ బాషా కొనియాడారు. తమిళనాడు రాష్ట్రం చెన్నై నుంచి ప్రతిష్ఠాత్మకమైన కలం బుక్ ఆఫ్ రికార్డ్స్ అధికారిక ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్న సందర్భంగా బుధవారం ఎమ్మెల్యే షాజహాన్ బాషా చేతులమీదుగా ప్రసంశ పత్రం, మెడల్, మూమెంటో అందజేయడం జరిగింది.

ఐఎన్ఐ సెట్‌లో హర్షితకు 38వ ర్యాంకు

విశాలాంధ్ర-పలమనేరు: పలమనేరుకు చెందిన డాక్టర్ బి.హర్షితకు ప్రతిష్టాత్మక ఆల్ ఇండియా ఎయిమ్స్ పీ.జీ.ఎంట్రెన్స్ టెస్ట్ లో 99.935 శాతంతో 38వ ర్యాంకు సాధించారు. గత నెల 10వ తేదీన ఎయిమ్స్ పీ.జీ. ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహించిన విషయం తెలిసిందే. దీంతో ఆమెకు పిజిఐయంఇఆర్, చండీగర్‌లో జనరల్ మెడిసిన్ సీటు సాధించారు. హర్షిత పలమనేరు పట్టణంకు చెందిన డాక్టర్ కె.సావిత్రి, డాక్టర్ బి.సుబ్రమణ్యం ద్వితీయ కుమార్తె కాగా బి.హర్షిత ఎంబిబిఎస్ డిగ్రీ ఇటీవల కర్నూలు మెడికల్ కాలేజీలో పూర్తి చేశారు. తల్లిదండ్రులు తమ కుమార్తె విజయం పట్ల హర్షం వ్యక్తం చేశారు. హర్షిత అక్క బావ కూడా డాక్టర్లే కావడం గమనార్హం. సాధించారు. పట్టణంలోని పలువురు, ప్రముఖులు మిత్రులు, శ్రేయోభిలాషులు హర్షితకు అభినందనలు తెలియజేసారు.

క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేట పట్టణంలోని పాలవెల్లి వారి వీధినందుగల షారోన్ చర్చ్ నందు క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సూళ్లూరుపేట శాసనసభ్యురాలు డాక్టర్ నెలవల విజయశ్రీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రేమ కరుణకు ప్రతిరూపం ఏసుక్రీస్తు, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆ యేసు క్రీస్తు చెప్పిన సన్మార్గంలో నడుచుకోవాలని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, సుళ్లూరుపేట పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఆకుతోట రమేష్, ఎ.జి.కిషోర్, మాధవ నాయుడు, అలవల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

తాటి తోపులో ఘనంగా క్రిస్మస్ సంబరాలు

విశాలాంధ్ర-తిరుపతి: క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని తిరుపతి రూరల్ మండలం తాటితోపు లోని ఆంగ్లికన్ చర్చ్ ఆఫ్ ఇండియా సంఘంలో బుధవారం క్రిస్మస్ సంబరాలు డాక్టర్ వేదనాయగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆంగ్లం చర్చ్ ఆఫ్ ఇండియా లో మాడివేటర్ జాన్ సత్య కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని క్రిస్మస్ వర్తమానం ప్రజలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాపులను రక్షించుటకు ప్రభువైన ఏసుక్రీస్తు లోకానికి వచ్చి ఉన్నాడని యేసయ్య జననం లోకంలో ఉన్న ప్రతి ప్రజలకు సంతోషకరమైన సువార్త మానమని తెలిపారు. ప్రియమైన యేసుక్రీస్తు లోకంలో ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రేమిస్తున్నాడని చెప్పారు ప్రతి ఒక్కరికి తోడుగా ఏసుక్రీస్తు ఉంటున్నాడని, ప్రతి ప్రార్థనకు జవాబు ఇస్తున్నారని తెలిపారు. అనంతరం డాక్టర్ వేదనాయగం మాట్లాడుతూ ఏసుక్రీస్తు చెప్పిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని, ప్రతి ఒక్కరు శాంతి సమాధానంలో జీవించాలని ప్రజలు అందరూ క్షేమంగా ఉండాలని కోరారు.

వెయ్యి మంది పేదలకు డాక్టర్ వేద నాయగం బట్టలు పంపిణీ

క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని ఆంగ్లికన్ చర్చ్ ఆఫ్ ఇండియా సంఘం ఆధ్వర్యంలో డాక్టర్ వేద నాయగం చేతుల మీదుగా సుమారు 1000 మంది పేదలకు అన్నదానం చేశారు. మహిళలకు చీరలు జాకెట్లతో పాటు పురుషులకు ప్యాంటు షర్టులను పంపిణీ చేశారు. ఈ క్రిస్మస్ సంబరాలలో బిషప్ రాబర్ట్, రేవరండ్ హేమంత్, రెవరెండ్ దేవానంద్ పాల్గొన్నారు. ఇంతకుముందు దేవకృషి దేవుని ఆరాధన చేసి మహిమ పరిచారు. సందర్భంగా భారీ క్రిస్మస్ ఏర్పాటు చేసి కట్ చేసి అక్కడికి వచ్చిన వారందరికీ పంచిపెట్టి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు.

జనవరి 7న శ్రీవారి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

విశాలాంధ్ర-తిరుమల కల్చరల్: తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో 2025 జనవరి 10 నుండి 19వ తేదీ వరకు పది రోజుల వైకుంఠ ఏకాదశి ద్వార దర్శనాలను పురస్కరించుకుని జనవరి 7వ తేదీ మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జరుగనుంది. సాధారణంగా సంవత్సరంలో నాలుగుసార్లు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవం, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు మంగళవారం ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. జనవరి 7వ ఉదయం 6 నుండి 10 గంటల వరకు ఈ ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని అర్చకులు ఆగమోక్తంగా నిర్వహిస్తారు. ఆనంద నిలయం మొదలుకొని బంగారు వాకిలి వరకు, శ్రీవారి ఆలయం లోపల ఉప దేవాలయాలు, ఆలయ ప్రాంగణం, పోటు, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుభ్రంగా కడుగుతారు. ఈ సమయంలో స్వామివారి మూల విరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పుతారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేస్తారు. అనంతరం స్వామివారి మూల విరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేక పూజలు, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతిస్తారు. జనవరి 7వ తేది కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కారణంగా బ్రేక్ దర్శనాలు రద్దు చేయడంతో 6వ తేది సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని టీటీడీకి సహకరించాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేయడమైనది.

'నాడోడి బతుకులు' నవల ఆవిష్కరణ

సాహిత్యం రేపటి సమాజానికి మార్గదర్శకం

విశాలాంధ్ర-తిరుపతి: అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో తిరుపతి నగరంలోని యూత్ హాస్టల్ లో సాయంత్రం రాష్ట్ర నాయకులు సాకం నాగరాజ సభాధ్యక్షతన 'నాడోడి బతుకులు' నవలను ప్రముఖ రచయిత పలమనేరు బాలాజీ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ యానాదుల ఆచార వ్యవహారాలు, సంస్కృతికి దర్పణం ఈ నవల అన్నారు. ఈ పుస్తకావిష్కరణకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ రచయిత్రి ప్రతిమ మాట్లాడుతూ రచయిత మూరిశెట్టి గోవింద్ పలు కులవృత్తుల వారి జీవితాలను ఇతివృత్తాలుగా తీసుకుని వాటిపై పరిశోధనలు సాగించి రచనలు చేయడం అభినందనీయమన్నారు. పుస్తకాన్ని సమీక్ష చేసిన ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఈ 21వ శతాబ్దంలోనూ యానాది సామాజిక వర్గం అనాగరికులుగా మిగిలిపోవడం బాధాకరమన్నారు. గిరిజనుల దుర్భర జీవితాలను, అనునిత్యం వారి జీవన వెతలను నవలలో నాయకుడు వెంకటేష్ పాత్ర ద్వారా రచయిత కళ్ళకు కట్టినట్టు చిత్రీకరించాడన్నారు. రేపటి సమాజ నిర్మాణమే నా ఆశయమని రచయిత మూరిశెట్టి గోవింద్ అన్నారు. ఈ కార్యక్రమంలో అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షులు యువశ్రీ మురళి, తిరువాయిపాటి రాజగోపాల్, గోవిందయ్య, ఏడుకొండలు, డాక్టర్ మౌని, తోట వెంకటేశ్వర్లు, పల్లిపట్టు నాగరాజు, ఇస్లాపురం బాలసుబ్రమణ్యం, జి.ఎస్.ప్రసాద్, మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యం సమాజానికి దిశానిర్దేశం

తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవం

విశాలాంధ్ర-తిరుపతి: సాహిత్యం మనిషిని, సమాజాన్ని సంస్కరించే సాధనమని పంచ సహస్రావధాని మేడసాని మోహన్ అన్నారు. బుధవారం ఉదయం తిరుపతి నగరంలోని యూత్ హాస్టల్ సమావేశ మందిరంలో తోట వెంకటేశ్వర్లు సభాధ్యక్షతన జరిగిన తిరుపతి జిల్లా రచయితల సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తోట వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సంఘంలో అతి తక్కువ సమయంలో 64 మంది శాశ్వత సభ్యత్వం తీసుకోవడం అభినందనీయమన్నారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథి మేడసాని మోహన్ గౌరవ అతిథి అకెళ్ళ విభీషణలు ప్రసంగిస్తూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా రచయితల సంఘం స్ఫూర్తి వంతమైన కార్యక్రమాలతో దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సాకం నాగరాజ, మన్నవ గంగాధర ప్రసాద్ లు మాట్లాడుతూ రేపటి తరమైన విద్యార్థులకు తెలుగు భాష సాహిత్యాల పట్ల అభిరుచి కల్పించే దిశగా ముమ్మరంగా కార్యక్రమాలు చెపట్టుతామన్నారు. సంఘం గౌరవ అధ్యక్షులు గార్లపాటి దామోదర నాయుడు రచించిన అన్నమయ్య వేంకటేశ్వర శతకాన్ని తాళ్లపాక వంశీయులు హరినారాయణ స్వాముల వారు ఆవిష్కరించారు. దీన్ని డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, పరమేశ్వరయ్యలు శతక ప్రశస్తి గురించి ప్రసంగించారు. అనంతరం జిల్లాలో ప్రముఖ రచయితలు ఆచార్య సర్వోత్తమరావు, వి.ప్రతిమ, పల్లిపట్టు నాగరాజులను నగదు పురస్కారాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం నాయకులు అంకమనాయుడు, యువశ్రీ మురళి, డాక్టర్ మౌని, మోహన మునిసిద్ధారెడ్డి, తమటం రామచంద్రారెడ్డి, గోవిందయ్య, ఏడుకొండలు, మాలేపట్టు పురుషోత్తమాచారి, రొడ్డ సురేంద్ర, దేవసేన నాయుడు,సుభద్ర, సుభాషిణి, శోభ, పరమేశ్వరయ్య, గజేంద్ర రెడ్డి, ఉషారాణి, సుకుమార్ రెడ్డి,రవి శేఖర్, చెంచయ్య, రమేష్ కుమార్,చెన్నకేశవులు, గుల్జార్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.